

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల
3★★★ జిల్లా వార్తలు
శనివారం 1 ఫిబ్రవరి 2025



'నిర్మలమ్మ' కరుణించేనా..!

- పవర్‌లూం మెగా క్లస్టర్ కోసం ఎదురుచూపులు
- ప్రతిసారి కేంద్ర బడ్జెట్‌లో మొండిచేయి
- నేటి కేంద్ర బడ్జెట్‌పై నేతన్నల ఆశలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మరమగ్గాల చప్పుళ్ల మధ్య బతుకు సమరం సాగిస్తున్న సిరిసిల్ల పవర్‌లూం యజమానులు, నేతన్నలకు మెగా పవర్‌లూం క్లస్టర్ తీరని ఆశగానే మిగిలిపోయింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టే ప్రతి బడ్జెట్‌లోనూ మెగా పవర్‌లూం క్లస్టర్ ప్రకటిస్తారనే ఆశగా ఎదురుచూస్తారు. తీరా బడ్జెట్‌లో ఊసే ఎత్తకపోవడం నిరాశ చెందడం, సర్వసాధరణంగా మారిపోయింది. 2025-26 కేంద్ర బడ్జెట్‌ను మరోసారి కేంద్ర మంత్రి నిర్మలమ్మ శనివారం ప్రవేశపెట్టనున్నారు. ఈసారైనా నిర్మలమ్మ మనస్సు కరుగుతుందనే ఆసక్తి నేత కుటుంబాల్లో మరోసారి కలుగుతోంది. సాధారణంగా కేంద్ర బడ్జెట్ అనగానే తమ రాష్ట్రానికి ఏం ప్రయోజనం కలగబోతుంది, పన్నుల పోటు, మినహాయింపులు, కొత్త పథకాలపై ప్రజలు చర్చిస్తారు. సిరిసిల్ల నేతన్నలు మాత్రం దశాబ్దకాలంగా ఉపాధిని పెంచే మెగా పవర్‌లూం క్లస్టర్ మంజూరుచేస్తారని ఎదురుచూస్తారు. 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో, ఆ తరువాత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నాయకులు సిరిసిల్ల మెగా పవర్‌లూం క్లస్టర్ కోసం విజ్ఞప్తులు చేశారు. గత ప్రభుత్వ హయాంలో చేనేత జౌళి శాఖ మంత్రిగా కేటీఆర్ అనేకసార్లు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు అందించినా ఫలితం లేకుండా పోయింది. ఈసారైనా బడ్జెట్‌లో మెగా పవర్‌లూం క్లస్టర్ ప్రకటిస్తారనే ఆశాభావంతోనే ఉన్నారు.

● హామీలకే పరిమితం..

కేంద్ర, రాష్ట్రాలను కుదిపేసిన సిరిసిల్ల నేత కార్మికుల బలవన్మరణాలు, ఆకలి చావుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ బృందాలు సిరిసిల్లలో పర్యటించి మెగా పవర్‌లూం క్లస్టర్, టెక్స్‌టైల్ జోన్‌గా ఏర్పాటుచేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని హామీలు ఇచ్చాయి. నేత కార్మికులను ఆశల్లో ఉంచగా హామీలకే కేంద్రం పరిమితమైంది. ప్రతి కేంద్ర బడ్జెట్ సమయంలో సిరిసిల్ల నేతన్నలు ఎదురుచూస్తూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సిరిసిల్లను మెగా పవర్‌లూం క్లస్టర్‌గా మార్చాలనే ప్రతిపాదనలు గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచి పంపిస్తూనే ఉన్నారు. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేంద్ర జౌళిశాఖ మంత్రి కావూరి సాంబ శివరావును ప్రస్తుత బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌లు మెగా పవర్‌లూం క్లస్టర్ హామీని పొందారు. అప్పటి బడ్జెట్‌లోనే ప్రకటిస్తారని ఆశించారు. కానీ నిరాశే మిగిలింది. 2004లో తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి వద్ద 60 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కును రూ.7.73 కోట్లతో ఏర్పాటు చేశారు. టెక్స్‌టైల్ పార్కులో ఆధునిక మరమగ్గాలను స్థాపించారు. దేశ, విదేశీ మార్కెట్‌లో అమ్ముడుపోయే విలువైన వస్త్రాలను ఉత్పత్తి చేయా లనే లక్ష్యంగా పెట్టుకున్నా పార్కులోకి అనుబంధ పరిశ్రమలు రాకపోవడంతో ఉత్పత్తుల్లో పెద్దగా మార్పులు రాలేదు. సిరిసిల్లలో టెక్నాలజీ మర మగ్గాలపై ఆధునిక ఉత్పత్తులు చేయలేక తరచూ పరిశ్రమ సంక్షోభాన్ని చవిచూసింది. ఆత్మహత్యలు, సంక్షోభం నేపథ్యంలో సిరిసిల్లలో మార్పులు తీసుకరా వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావించాయి. అప్పటి కేంద్ర ప్రభుత్వం సిరిసిల్ల మెగా పవర్‌లూం క్లస్టర్‌ను ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మారి పోయి బీజేపీ ప్రభుత్వం రావడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. 2016 బడ్జెట్ సమయంలో అప్పు డు రాష్ట్ర మంత్రిగా కేటీఆర్ మూడుసార్లు ఢిల్లీకి వెళ్లి, అప్పటి చేనేత జౌళిశాఖ మంత్రి సంతోష్ గంగువార్ లను కలిసి వస్త్ర పరిశ్రమ సమస్యలను వివరించారు. మెగా పవర్‌లూం క్లస్టర్ ప్రతిపాదనలు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి పంపించామని తెలపడంతో ఆ బడ్జెట్‌లో పవర్‌లూం క్లస్టర్‌కు చోటు దక్కుతుందని భావించారు. మొదటి విడతలో దేశంలో ఐదు మెగా క్లస్టర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా సిరి సిల్లకు చోటు దక్కలేదు. 2017 బడ్జెట్ సమయంలో కూడా కేటీఆర్, అప్పటి ఎంపీ వినోద్‌లు చేనేత జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీని కలిసి మెగా పవర్‌లూం క్లస్టర్‌ను సాధించుకునే విధంగా చర్యలు చేపట్టారు. కానీ ఆ బడ్జెట్‌లో కూడా మోక్షం లభించలేదు. అదేక్రమంలో 2018, 2019, 2020, 2021, 2022, 2023 బడ్జెట్‌లలో కూడా అదే పరిస్థితి ఎదురైంది. ఈసారి ఎలా ఉండబోతుందనే ఆసక్తి ఏర్పడింది. గత రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల నేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వ ఆర్డర్లను అందించింది. బతుకమ్మ చీరల ద్వారా కార్మికులు నెలకు రూ.16 నుంచి రూ.18 వేల వరకు వేతనాలు పొందుతూ వచ్చారు. మరోవైపు అపెరల్ పార్కులో గార్మెంట్ పరిశ్రమ మొదలుకావడంతో మహిళలకు ఉపాధి లభిస్తోంది. కార్మికులను యజమానులుగా మార్చే వర్కర్ టు ఓనర్ పథకం..

మిగతా 6లో

న్యూస్ బాక్స్

నేడు మార్కండేయ స్వామి శోభాయాత్రకు ఏర్పాట్లు

సిరిసిల్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా అత్యంత వైభవంగా నిర్వహించే శ్రీశివభక్త మార్కండేయస్వామి జయంతి,శోభాయాత్రకు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. శనివారం జరిగే జయంతి సందర్భంగా మార్కండేయ మహాయజ్ఞం, పూర్ణాహుతి నిర్వహిస్తారు. సాయంత్రం 4గంటలకు మార్కండేయస్వామి శోభాయాత్ర నిర్వహణకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు.

ఆలయ నిర్మాణానికి స్థలం అందజేత

చందుర్తి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శివాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఎన్నారై మోతే బాబు 200 గజాల స్థలాన్ని విరాళంగా గ్రామస్తులకు శుక్రవారం అందజేశారు. దాదాపు రూ.25లక్షల విలువచేసే భూమికి చెందిన డాక్యుమెంట్లను ఆలయ నిర్మాణంకు అందజేయడంపై గ్రామస్థులు బాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పులి సత్యంగౌడ్, గొట్టె ప్రభాకర్, కత్తి తిరుపతిగౌడ్, పిట్టల బాబు, చంద్రం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



ఆలయంలో ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

ఇల్లంతకుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో ధ్వజస్తంభాన్ని శుక్రవారం భక్తిప్రపత్తుల మధ్య ప్రతిష్ఠించారు. మండలంలోని పలు గ్రామాల అయ్యప్పస్వాములు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు రాజు, గోపాలచారి, బిల్ల రఘులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం

ఇల్లంతకుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుపేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర కిసాన్‌సెల్ ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో శుక్రవారం సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం సఫలం అయ్యిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పనితీరు పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. సమావేశంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఏఎంసీ డైరెక్టర్ వెంకటరెడ్డి,నాయకులు కరివెద కర్ణాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- 15 మంది ప్రయాణికులకు గాయాలు **4**



క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న 108 సిబ్బంది

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు **5**



కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

'స్థానిక' ఎన్నికలే లక్ష్యంగా ముందుకు..

- బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనరసింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. వేములవాడ అర్బన్ మండల పరిధిలోని అన్ని గ్రామాల ముఖ్య ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఏడాది కాలంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అబద్ధాలు చెప్పి మరింత బలహీనపడిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారని, ప్రతి కార్యకర్త తన బలమేంటో చూపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఆరు గ్యారంటీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గడచిన కాలంలో ప్రజలకు అబద్ధాలు చెప్పి చెప్పి చివరికి చేసింది ఏం లేదని, ముఖ్యంగా రైతు భరోసా ఇస్తామని నమ్మబలికి తీరా సమయానికి వాయిదాల మీద వాయిదాలు వేస్తూ ఏడది కాలం పూర్తి చేసిందని, మరో ఏడాది కాలానికి ఏం చెప్పాలో ఆలోచనలో పడిందన్నారు. గెలుపే లక్ష్యంగా పనిచేసే వచ్చే పంచాయతీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యకర్తకు తన వంతు సహాయసహకారం అందిస్తానన్నారు. ఈ సమావేశంలో సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, సీనియర్ నాయకులు బూర బాబు, ఆర్‌సి రావు, తాజా మాజీ సర్పంచులు రేగులపాటి రాణి, స్వయంప్రభ, వెంకటరమణారావు, రాసురి రాజేశం, జిల్లా కోఆర్డినేటర్ వనపట్ల సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

వ్యసనాలకు బానిసలు కావొద్దు

ఇల్లంతకుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలు పాడు చేసుకోవద్దని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి పేర్కొన్నారు. మండలంలోని పత్తికుంటపల్లెలో శుక్రవారం మీకోసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మహమ్మారి కొంతమంది యువకుల పాలిట శాపంగా మారిందన్నారు. సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సై కదిరే శ్రీకాంత్ గౌడ్, ఏఎస్ఐ ఫస్యుద్దీన్‌తో పాటు పోలీస్ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- నేరెళ్ల ఉన్నత పాఠశాల తనిఖీ



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

తంగళ్లపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. మండలంలోని నేరెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, తరగతిగదులు, మధ్యాహ్న భోజనాలు సిద్ధంచేసే గది, వండే విధానాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేస్తున్నారా అని ఆరాతీశారు. కూరగాయలు పప్పు, కోడిగుడ్ల నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులు, టీచర్ల హాజర్‌పై ఆరా తీశారు. మొత్తం 84మంది విద్యార్థులు, టీచర్లందరూ హాజరయ్యారని హెచ్‌ఎం విద్యాసాగర్ వివరించారు. అనంతరం పాఠశాలలోని 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గదులను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ పాఠాలు బోధించారు. మ్యాథ్స్‌లో ప్రశ్నలు వేసి, విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను సిద్ధం చేయాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రతి పాఠ్యాంశాన్ని అర్థమయ్యేలా వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలు

- పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి - ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి



టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): శాసన మండలి ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలాసత్పతి అన్నారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆమె టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్ పట్టభద్రులు, టీచర్స్ శాసనమండలి సభ్యుల స్థానాలకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేసిందన్నారు. ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని, 10వరకు నామినేషన్‌ల స్వీకరణ, 11న పరిశీలన, 13 లోపు ఉపసంహరణ గడువు, 27న పోలింగ్ ఉంటుందని తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలుచేయాలని, 24గంటలు, 48గంటలు, 72గంటల్లో తీసుకోవాల్సిన చర్యలపై రిపోర్ట్ అందించాలన్నారు. మండలాల్లో ఇప్పటివరకు ఓటర్ నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొని పెండింగ్‌లో ఉన్న పట్టభద్రులు, టీచర్స్ ఓటర్‌నమోదు దరఖాస్తులను ఫిబ్రవరి 7లోగా పరిష్కరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్‌లు పరిశీలించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రచారానికి అవసరమైన అనుమతులను నిబంధనల ప్రకారం జారీ చేయాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో పట్టభద్రులకు సంబంధించి 28 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 21వేల 614 మంది ఓటర్లు, ఉపాధ్యాయులకు సంబంధించి 13 మండలాల పరిధిలో 874 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించిన నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కలెకరేట్ సీ సెక్షన్ పర్యవేక్షకులు ప్రవీణ్, ఎన్నికల సిబ్బంది పాషా, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఈ ఆత్మహత్యపై విచారణ జరపాలి



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సిరిసిల్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా గరిపల్లి వద్ద మిషన్ భగీరథ ఏఈ సాయిచరణ్ ఉద్యోగంలో చేరి ఆరు నెలలు గడవకముందే ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, దీనిపై విచారణ కమిటీ వేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి బోల్గం సాగర్, కోశాధికారి విశ్వాస్‌లు కోరారు. శుక్రవారం వేములవాడ మండలం అగ్రహా రం మిషన్‌భగీరథ ఇంట్రా కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సాయిచరణ్ మృతిపై మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని ఇంజనీరింగ్ విభాగాల ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా సమ్మయ్య



సమ్మయ్య

సిరిసిల్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా సాల్వాడి సమ్మయ్య శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. సిరిసిల్ల కమిషనర్‌గా పనిచేసిన దుబ్బాక లావణ్య హైదరాబాద్ జీహెచ్‌ఎంసీకి బదిలీ అయ్యారు. హుజురాబాద్ కమిషనర్‌గా పనిచేస్తున్న సమ్మయ్య సిరిసిల్ల కమిషనర్‌గా బదిలీ చేయగా బాధ్యతలు స్వీకరించారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



గాయపడిన మహిళలను పరామర్శిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : బస్సు ప్రమాద క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. శుక్రవారం టీజీఎస్‌ఆర్టీసీ కామారెడ్డి డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు కామారెడ్డి నుంచి సిరిసిల్ల వస్తుండగా గంభీరావుపేట మండలం గోరంటాల శివారులో బ్రేకులు ఫైల్ అయి అదుపుతప్పి పొలంలోకి దూసుకుపోయింది. అందులోని ప్రయాణికులకు గాయాలుకాగా వారిని సిరిసిల్ల పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

చందుర్తి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా వైద్యాధికారి ఎస్ రజిత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. కలెక్టర్ ఆదేశానుసారం ఆమె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా జాతీయ కార్యక్రమాలపైన ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంపత్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ రేఖ, డీడీఎం కార్తీక్, సిబ్బంది పాల్గొన్నారు..

నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

తంగళ్లపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ అంజీల ఆల్ఫ్రెడ్ శుక్రవారం తనిఖీచేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఈ.చంద్రికరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

కోనరావుపేట, జనవరి 31 (ఆంధ్ర జ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీతో పరీక్ష పే చర్చా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థి అలువాల సాయితేజ సుద్దాల గ్రామస్థులు గురువారం సన్మానించారు. విద్యార్థి, అతడి తల్లిదండ్రులను బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. బీజేపీ నాయకులు అంబోజ లక్ష్మీనారాయణ,ఎల్లంకి ప్రసాద్, జితేందర్‌రెడ్డి, అబురం తిరుపతి ఉన్నారు.

వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం

ముస్తాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మార్కెట్ లోగల శివాలయంలో ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీవాసవీ మాత ఆత్మార్పణ దినోత్సావాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం అర్చకులు నాగేంద్రశర్మ మంత్రోచ్ఛరణల మధ్య ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి మాత ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకాలు, కుంభామేళా త్రివేణి సంగమం నుంచి తీసుకువచ్చిన జలంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. గందె రమేశ్, చందా విజయ్ కుమార్, కూర సంతోష్, దొంతుల దినేశ్, నార్ల శ్రీనివాస్, మేడిశెట్టి రాజు, పప్పుల శ్రీనివాస్, గందె శంకరయ్య, రాజు, చంద్రం, సుధాకర్ పాల్గొన్నారు.

పట్టించుకునే వారు లేక..

- తప్పని పరిస్థితుల్లో అధికారులను ఆశ్రయిస్తున్న వృద్ధులు
- వారసులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు
- హుజూరాబాద్ డివిజన్ పరిధిలో 46 ఫిర్యాదులు



హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వృద్ధులు (ఫైల్)

హుజూరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జీవితం చరమాంకంలో ఉన్న వృద్ధులను వారి పిల్లలు పట్టించుకోకపోవడంతో వారు అధికారులను ఆశ్రయిస్తున్నారు. బాల్యంలో తమ బాగోగులను చూసి భవిష్యత్తును బంగారు మయం చేసి భరోసా కల్పించిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. మరికొందరు తల్లిదండ్రులను అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలకు పంపిస్తున్నారు. దయనీయ స్థితిలో ఉన్న తల్లిదండ్రులపై చేయి చేసుకొని సభ్య సమాజం తల దించుకునేలా వ్యవహరిస్తున్నారు. వీటన్నిటికి విరుగుడు చూపిస్తూ 2005లో అప్పటి ప్రభుత్వం రెవెన్యూ శాఖ ద్వారా సీనియర్ సిటిజన్ యాక్టు తీసుకువచ్చింది. వృద్ధ తల్లిదండ్రులపై కఠినంగా వ్యవహరించే వారసులకు హెచ్చరికలు జారీ చేసింది.

● తల్లిదండ్రులపై పెరుగుతున్న దాడులు

నేటి సమాజంలో రోజు రోజుకు వృద్ధ తల్లిదండ్రులపై దాడులు పెరిగిపోతున్నాయి. కళ్ల ముందే కొన్ని సంఘటనలు జరుగుతుంటే మాకేందుకులే అని సమాజం పట్టించుకోవడం లేదు. వృద్ధ తల్లిదండ్రుల స్థిర, చిరాస్థులను తమ పేర్లపై మార్చుకుని వారిని పట్టించుకోవడం లేదు. పైగా దాడులు చేస్తున్నారు. 2005లో సీనియర్ సిటిజన్ యాక్టు వచ్చినా దాని గురించి పెద్దగా ప్రచారం లేదు. ఇటీవల సీనియర్ సిటిజన్ యాక్టుపై విస్తృత ప్రచారం జరుగుతుంది. వృద్ధ తల్లిదండ్రులను పోషించకపోయినా, వారిపైన దాడులు చేసినా చట్టం అటువంటి వారిని శిక్షిస్తుంది. సీనియర్ సిటిజన్ యాక్టు ప్రకారం వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఇళ్ల పట్టాలు చేసుకున్న తర్వాత వృద్ధ తల్లిదండ్రుల బాగోగులు పట్టించుకోకపోతే ఆ పట్టాను రద్దు చేసి తిరిగి తల్లిదండ్రులకే ఆ భూములు చెందేలా చేయవచ్చు ఉద్యోగాలు చేసే పిల్లలు తల్లిదండ్రులను పట్టించుకోకపోతే వారి వేతనం నుంచి 10వేల రూపాయలు ఇచ్చే వెసులుబాటు ఉంది. ఇవి తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ పరిధిలోకి వస్తాయి.



హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయం

● కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

డివిజన్‌లోని జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం మండలాల్లోని సీనియర్ సిటిజన్ యాక్టు గురించి తెలుసుకున్న 46 మంది వృద్ధులు ఆర్డీవో రమేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేయగానే అధికారులు వారి వారసులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వినని వారిని స్థిరాస్తులు మార్పులు చేస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు వచ్చిన 46 ఫిర్యాదుల్లో 33 పరిష్కారమయ్యాయి. 13 కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని ఆర్డీవో రమేష్ బాబు తెలిపారు. ఉద్యోగులు కూడా తమ తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

గాయపడిన వృద్ధురాలు మృతి



పద్మ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 19న వంట చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని తీవ్ర గాయాలపాలైన వృద్ధురాలు బొమ్మకంటి పద్మ(76) స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. గ్రామంలోని తనఇంటిలో పద్మ ఒంటరిగా నివసిస్తోంది. వంటచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు చీర అంటుకుంది. మంటల్లో చిక్కుకున్న ఆమె కేకలు వేయడం వల్ల చుట్టుపక్కల వారు గమనించి కాపాడారు. అప్పటికే ఆమె తీవ్ర గాయాలపాలైంది. సమాచారం అందుకున్న కుమారులు, బంధువులు పద్మను స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

బైక్‌పై నుంచి పడి మహిళ..



భారతి (ఫైల్)

చొప్పదండి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణశివారులో బైక్‌పై నుంచి కిందపడి మహిళ మృతిచెందిన సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ అనూష కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన పసుపునుటి భారతి(60) నగునూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి బైక్‌పై వెళ్తోంది. బైక్‌ను కుమారుడు చంద్రశేఖర్ నడుపుతుండగా నవోదయ శివారులో మేకపిల్ల అడ్డువచ్చింది. చంద్రశేఖర్ తన బైక్‌ను అకస్మాత్తుగా నిలిపివేయగా వెనుకాల కూర్చున్న భారతి కిందపడింది. ఈప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స కోసం వెంటనే ఆమెను 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భారతి కుమారుడు పుసుపునూటి రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం



మల్లేష్ (ఫైల్)

వేములవాడ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం దుబాయి దేశం వెళ్లిన వ్యక్తి మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరింది. వేములవాడ పట్టణం తిప్పాపూర్ గ్రామానికి చెందిన గుడిసె మల్లేష్ (40) 18 నెలల క్రితం దుబాయి దేశం వెళ్లాడు. గత సంవత్సరం డిసెంబర్ 24వ తేదీన కూలిపని చేస్తుండగా ఇసుకదిబ్బ కూలి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. దీంతోమృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య ప్రమీల, కూతురులు కీర్తన, సాత్వికప్రియతో పాటు కుమారుడు ఉన్నాడు. మల్లేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

ఎలిగేడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన గోసిక అంజయ్య (29) అనే యువకుడు పురుగులమందు తాగి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య మద్యానికి బానిసై రోజూ ఇంట్లో గొడవచేసేవాడు. అదే క్రమంలో ఈనెల 29న పురుగుల మందు తాగాడు. గమనించిన బంధువులు కరీంనగర్‌కు అక్కడినుంచి హైదరాబాద్‌కు గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడు అంజయ్య సోదరుడు గోసిక శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సనత్‌కుమార్ తెలిపారు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

● 15 మంది ప్రయాణికులకు గాయాలు



గోరంటాల వద్ద అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

గంభీరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామ సమీపంలోని బ్రిడ్జివద్ద ఏపీ 29జెడ్ 1742నంబర్ గల కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 15మందిప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరిని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, మరికొందరిని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు. కామారెడ్డినుంచి 52మంది ప్రయాణికులతో కరీంనగర్ వెళుతున్న ఆర్టీసీబస్సు గొరంటాల గ్రామ సమీపంలోని బ్రిడ్జివద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. పంటపొలాల్లో ఉన్న రైతులు, గ్రామయువకులు, నాయకులు ప్రమాదస్థలానికి చేరుకుని బస్సులోంచి ప్రయాణికులను కిందకుదించి, అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరళించారు. కామారెడ్డి ఆసుపత్రికిలో ఐదుగురు, సిరిసిల్లఆసుపత్రిలో 10మంది ప్రయాణికులు చికిత్సపొందుతున్నారు. ఎవరికీ ప్రాణాపాయం లేదనితేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈప్రమాదంలో కామారెడ్డి, తాడ్వాయి, రెడ్డిపేట, మాచారెడ్డి మండలాలకు చెందినవారు ఉన్నట్టుగా భావిస్తున్నారు. సంఘటనా స్థలానికి కామారెడ్డి డిపో మేనేజన్ ఇందిర, ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్‌ఐ శ్రీకాంత్ చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగితెలుసుకున్నారు. బ్రేకులు ఫెయిల్ అయ్యి ప్రమాదం జరిగిందా లేక వాహన వేగంలో స్టీరింగ్‌కు లాక్‌పడి ప్రమాదం జరిగిందా తెలియాల్సి ఉంది.

భార్యను హత్యచేసిన కేసులో జీవిత ఖైదు

కమాన్‌పూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌కు చెందిన కోల తిరుపతికి భార్యను చంపిన కేసులో గోదావరిఖనిజిల్లా ఆరో సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి డాక్టర్ టి శ్రీనివాసరావు జీవతఖైదు విధించారు. కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జూలపల్లి గ్రామానికి చెందిన కోల స్వరూపను ఆమె భర్త కోల తిరుపతి 2020నవంబర్ ఆరవతేదీన గొంతునులిమి హత్య చేశాడు. ఈ మేరకు మృతురాలు స్వరూప తమ్ముడు కన్నం రాజేందర్ ఫిర్యాదు మేరకు అప్పటి కమాన్‌పూర్ ఎస్సై పి శ్యామ్‌పటేల్ కేసు నమోదుచేశారు. అప్పటి గోదావరిఖని 2వపట్టణ సీఐ కె లక్ష్మీనారాయణ దర్యాప్తు చేసి నివేదికను కోర్టులో సమర్పించారు. పబ్లిక్‌ప్రాసిక్యూటర్ టి జ్యోతిరెడ్డి సాక్షులను ప్రవేశపెట్టగా విచారణ అనంతరం గోదావరిఖని సెషన్‌కోర్టు న్యాయమూర్తి టి శ్రీనివాసరావు నిందుతునికి జీవితఖైదుతో పాటు, 1000రూపాయలు జరిమానా విధించారు.

రైలునుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఓదెల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓదెల రైల్వేస్టేషన్‌లో గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలునుంచి ప్రమాదవశాత్తు రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. గోరఖ్‌పూర్ నుంచి తిరువనంతపురం కొచ్చి వైపువెళ్లే రైలు బోగీలో ఉన్నవ్యక్తి రైలునడుస్తున్న సమయంలో మరోబోగీ ఎక్కే ప్రయత్నంలో రైలు ప్లాట్‌ఫాం మధ్య పడి మృతిచెందాడు. మృతుడు బ్లూ కలర్ చొక్కా, నల్లటి ప్యాంట్ ధరించి ఉన్నాడు . అతని వద్ద సెల్ ఫోన్ లభించినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

వనం వీడి.. జనంలోకి నెమలి



గంభీరావుపేటలోకి వచ్చిన నెమలి

గంభీరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వనం వీడి ఓ వన్యప్రాణి జనంలోకి వచ్చింది. అడవుల్లో పంట పొలాల్లో సంచరించే నెమలి ఊళ్లోకి వచ్చింది. గంభీరావుపేట గాంధీ చౌక్ నుంచి లింగన్నపేట వెళ్లే ప్రధాన రహదారిలో అనూహ్యంగా నెమలి ప్రత్యక్షమైంది. దీంతో వనంలో ఉండాల్సిన వణ్యప్రాణి జనంలోకి రావడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. కొన్ని గంటల పాటు నెమలి ప్రధాన రహదారిలో తిరగడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

సీఐ అరాచకాలపై న్యాయపరమైన విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాదితులు

జమ్మికుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణసీఐ వరంగంటి రవికుమార్‌పై జ్యుడీషియల్ ఎంక్వైరీ జరిపించాలని బాధితులు షేక్ సాబీర్‌అలీ, అంబాల రాజు, కాటిపల్లి లక్ష్మి, కాటిపల్లి సంధ్యారాణి, ఠాగూర్ సుశీల అన్నారు. శుక్రవారం జమ్మికుంటలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పోలీస్ అధికారులను కూడా సీఐ వేధిండన్నారు. జమ్మికుంటలో పనిచేయనివ్వకుండా ఇతరప్రాంతాలకు పంపిస్తున్నాడని ఆరోపించారు. పోలీస్‌స్టేషన్లో ఒక ప్రైవేట్ వ్యక్తి సీఐ గన్‌మెన్‌గా చలామణి అవుతున్నాడన్నారు. అతడికి తోడు హోంగార్డు యాకూబ్ కూడా ఉన్నాడన్నారు. వీరిద్దరూ ఇసుక ట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూళ్లు చేస్తారని, డబ్బులు ఇవ్వని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తీసుకువచ్చి కేసులు పెట్టిస్తున్నారని మండిపడ్డారు. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ అన్ని విషయాల్లో సీఐని ఏసీపీ శ్రీనివాస్ జీ కాపాడుతున్నారని, ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి వారిద్దరిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిఏడల ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడి డబ్బులు పోగొట్టుకున్న యువకుడు

● మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం ● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



బూస కార్తీక్ (ఫైల్)

శంకరపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రమ్మీకి అలవాటు పడ్డాడు. లక్షలు సంపాదించవచ్చని భ్రమపడ్డాడు. ఉన్న డబ్బులు పోగొట్టుకుని చివరి ఆత్మహత్యాయ్నం చేసుకోగా శుక్రవారం రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. వివరాల్లోకి వెళితే.. శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన బూస కార్తీక్(25) ఆన్‌లైన్ రమ్మీ ఆటకు అలవాటుపడ్డాడు. దీంతో చేసిన అప్పులకు గతంలోనే తల్లిదండ్రులు అర ఎకరం భూమి అమ్మి ఆ అప్పు తీర్చారు. అయినప్పటికీ కార్తీక్‌లో మార్పు రాలేదు. మళ్లీరమ్మీ ఆటకోసం రూ.2లక్షల వరకు తల్లిదండ్రులకు తెలియకుండా అప్పులు చేసినట్లు సమాచారం. ఆ డబ్బులు కూడా ఆటలో పోగొట్టుకున్నాడు. తల్లిదండ్రులకు విషయం తెలపలేక అప్పు తీర్చే దారిలేక మనస్థాపంతో ఈనెల28న గద్దపాక శివారులోని వాగువద్ద క్రిమిసంహారక మందు తాగాడు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా స్నేహితుడు జక్కుల రాజ్‌కుమార్‌కు తెలిపాడు. రాజ్‌కుమార్ కార్తీక్ తండ్రికి శంకర్‌కు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని కార్తీక్‌ను జమ్మికుంటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం హనుమకొండలోని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల30న రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట గ్రామశివారులోని మడేలేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న విద్యుత్ బోరు మోటారు తీగను అపహరించుకుపోయిన సంఘటనలో గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌కు చెందిన శివరాత్రి శ్రీనివాస్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామ శివారులోని మడేలేశ్వరస్వామి ఆలయం సమీపంలోని విద్యుత్ బోరు మోటారుతీగను ఈనెల8న గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ చైర్మన్ దీటి నర్సయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మండలకేంద్రంలోని రెండవబైపాస్ రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు శ్రీనివాస్ కరెంటు తీగతో పట్టుబడ్డాడు. అదుపులోకి తీసుకుని విచారించగా ఆలయం వద్ద ఉన్న బోరు మోటారు తీగను దొంగిలించానని అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి రూ.8 వేల విలువైన విద్యుత్ తీగను స్వాధీనపర్చుకుని శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

రెస్టారెంట్‌లో కార్పొరేషన్ సిబ్బంది తనిఖీలు

కోల్‌సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో శుక్రవారం తనిఖీలు నిర్వహించినట్టు మున్సిపల్ కార్పొరేషన్ వర్గాలు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. కార్పొరేషన్ హెల్త్ అసిస్టెంట్ కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, శానిటేషన్ సిబ్బంది శ్రీకాంత్, శ్రావణ్, ప్రశాంత్ తనిఖీల్లో పాల్గొన్నారు. రెస్టారెంట్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించనందున రూ.10వేల జరిమానా విధించినట్టు పేర్కొన్నారు.

గజసింగవరంలో దొంగల బీభత్సం..

● రెండిళ్లలో చోరీ ● రూ.60 వేల నగదు, 2 తులాల బంగారం అపహరణ



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

గంభీరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలో గురువారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిన ఇళ్లలోకి దొంగలు చొరబడి నగదుతోపాటు, బంగారం, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. బాల్‌నర్సు శ్రీకాంత్, బాయిని బాలయ్య ఇళ్ల తాళాలను పగులగొట్టి దొంగతానికి పాల్పడ్డారు. శ్రీకాంత్ తల్లి అనారోగ్యంతో సిద్దిపేటలోని ఓఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో శ్రీకాంత్ తన కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళంవేసి ఆసుపత్రిలో ఉన్న తల్లి వద్దకు వెళ్లి, గురువారంరాత్రి అక్కడేఉన్నారు. దీంతో శ్రీకాంత్ ఇంటికివేసిన తాళాలను పగులగొట్టి లోనికి చొరబడి బీరువాలోఉన్న 60వేలనగదు, 2తులాల వెండి, నాలుగు పట్టగొలుసుల జతలు దొంగలు ఎత్తుకెళ్లారు. బాయిని బాలయ్య అదే గ్రామంలో కొత్త ఇల్లునిర్మించుకుని పాతఇంటికి తాళం వేశాడు. పాతఇల్లు తాళం పగులగొట్టి దొంగలు చొరబడ్డారు. అయితే ఆ ఇంట్లో ఏమి లేకపోవడంతో నష్టం జరగలేదు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఐ శ్రీకాంత్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ సిబ్బంది కూడా పరిసరాలను పరిశీలించి వెళ్లారు.

ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లో భారీ చోరీ

● తాళం పగులగొట్టి రూ.15లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు

కోల్‌సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లోని ఇనగంటి రాంమోహన్‌రావు అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో భారీ చోరీ జరిగింది. అతడిభార్య క్యాన్సర్ చికిత్స నిమిత్తం ఇంటికి తాళంవేసి ఈనెల26న రాంమోహన్‌రావు తన కుటుంబసభ్యులతో హైదరాబాద్‌కు వెళ్లాడు. శుక్రవారం తిరిగివచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దొంగలు ఇంట్లోని కబోర్డ్‌లో ఉన్న రూ.15.2లక్షల నగదును ఎత్తుకెళ్లారు. రెండురోజుల క్రితం చోరీజరిగినట్టు తెలుస్తోంది. భార్య చికిత్సనిమిత్తం ఇటీ వలే గోదావరిఖనిలోని తనప్లాట్ అమ్మగా వచ్చిన నగదును ఇంట్లో పెట్టానని, అత్యవసర చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లినట్టు ఆయన పేర్కొన్నారు.

● బెడ్‌రూమ్ తాళం చెవి ఉండడంతో..

ప్రధానద్వారం తాళం పగులగొట్టి లోనికి చొరబడిన దొంగలు బెడ్‌రూమ్ తాళంతీసి లోనికి వెళ్లారు. బెడ్‌రూమ్ తాళంచేయి అందుబాటులో ఉండడంతో వారికి తాళం పగులగొట్టకుండానే లోనికివెళ్లడం సులు వైంది. ఇతర ఆభరణాలు కానీ, వస్తువులుకానీ ఎత్తుకెళ్లలేదు.భారీస్థాయిలో నగదు దొరకడంతో దానితో ఉడాయించారు. ఎన్టీపీసీ పోలీసులు, కమి షనరేట్ సీసీఎస్, క్లూస్ టీమ్‌లు ఘటనస్థలంలో పరిశీలించాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

● కేసు నమోదు



స్రవంతి, శ్రీమోక్ష(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జనవరి31(ఆంధ్రజ్యోతి):ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలోని బిట్ల స్రవంతి, ఆమె ఐదేళ్లకూతురు శ్రీమోక్షలు అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ శుక్రవారం తెలిపారు. గ్రామంలోని బిట్ల మల్లేశంభార్య స్రవంతి తన కూతురు శ్రీమోక్షను తీసుకుని ఈనెల 28న చందుర్తిలోని తన తల్లిగారింటికి వెళుతున్నానని ఇంటిలో చెప్పి బయలుదేరారని పేర్కొన్నారు. భార్య, కూతురు చేరుకున్నారో..? లేదోనని అత్తగారింటికి ఫోను చేసిన మల్లేశంకు అక్కడకు రాలేదని తెలిసిందన్నారు. చుట్టుపక్కల, బంధువులవద్దఆరాతీసినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. బాధితుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు.

న్యాయవాది పేరుతో ఘరానా మోసం

● రూ.1.30 కోట్లు వసూలు.. యువకుడి అరెస్ట్



ఫణిధర్

సిరిసిల్ల క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది పేరుతో ఓ వ్యక్తి ఘరానా మోసానికి పాల్పడ్డాడు. సమస్యలు పరిష్కరిస్తానని చెప్పి దాదాపు కోటి 30లక్షల రూపాయలు వసూలు చేశాడు. వచ్చినడబ్బుతో జల్సాలు చేశాడు. బాధితులు సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన ఏనుగు ఫణిధర్ అనే నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్ల టౌన్‌సీఐ కే కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన ఏనుగు ఫణిదర్ అనేవ్యక్తి తన సంపాదన సరిపోక శ్రమ లేకుండా పెద్దమొత్తంలో డబ్బులు సంపాదించాలనుకున్నాడు.

గతంలో స్థానికంగా ఓ న్యాయవాది వద్ద క్లర్క్‌గా పనిచేశాడు. ఆ అనుభవంతో భూ, సివిల్ తగాదాలు, లోన్ సమస్యలు, భార్యభర్తల గొడవలు... ఇలా కోర్టుకు సంబంధించిన సమస్యలపై ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని భావించాడు. న్యాయవాది అవతారమెత్తి కోర్టుల్లో కేసులు ఫైల్ చేయడానికి వచ్చే బాధితులతో పరిచయాలు చేసుకుంటూ, తనే న్యాయవాదినని నమ్మించాడు. గతంలో సిరిసిల్ల పట్టణంలోని బడ్స్ అండ్ ఫ్లవర్స్ ప్రైవేట్ స్కూల్ యజమాని కొంటికర్ల వారణాసి కాలిమాతకు సంబం ధించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులో భూసమస్యను పరిష్కరిస్తానని నమ్మించి 25లక్షల రూపాయలు తీసుకొన్నాడు. సంజీవయ్య నగర్‌కు చెందిన దరిపల్లి సురేష్, అతడి సోదరుడు రమేష్‌లపై ఉన్న చెక్‌బౌన్సు కేసులతో పాటు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరిస్తా నని నమ్మించి, పలు దఫాలుగా మొత్తం రూ.91,52,250 తీసుకున్నాడు. తాజాగా పెద్దూర్‌లోని డబుల్ బెడ్‌రూమ్‌లకు చెందిన విజయలక్ష్మిని నమ్మించి రూ.1.90 లక్షలు తీసుకొన్నాడు. అదేవిధంగా చంద్రంపేటకు చెందిన యెల్ల లలిత భూసమస్య పరిష్కరిస్తానని నమ్మించి ఆమె వద్ద రూ.11.60 లక్షలు వసూలు చేశాడు.

అయితే ఫణిధర్ చేతిలో మోసపోయామని తెలుసుకున్న బాధితులు సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి, సెల్‌ఫోన్‌తో పాటు పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు పంపినట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. ఇంకా బాధితులు ఎవరైనా ఉంటే సిరిసిల్ల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థినులకు అస్వస్థత



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ధర్మపురి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని మైనార్టీబాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం వికటించి శుక్రవారం ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం జుహా, శ్రావ్య, హుమేరియా, నందిని, కీర్తిమణి అనే ఐదుగురు విద్యార్థులకు కడుపు నొప్పి వచ్చి వాంతులు చేసుకున్నారు. వెంటనే కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కాళ్ల లక్ష్మి చికిత్సకోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. బియ్యం సరిగా ఉడుకకపోవడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలుస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రులు సమాచారం అందుకుని హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి చికిత్సపొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఆసుపత్రి డాక్టర్ రాముతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులను మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్ ద్వారా జగిత్యాల ఆసుపత్రికి పంపించారు. అనంతరం విప్ మాట్లాడుతూ ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులను టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జక్కు రవీందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్ కుమార్, బీజేపీ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ పరామర్శించారు అస్వస్థతకు గురైన విద్యార్థులు నాగులపేట, రేచపల్లి, తాళ్లపేట, బురుదేశిపల్లె, గోవింద్‌పల్లెకు చెందిన వారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కాళ్ల లక్ష్మి తెలిపారు.

మహాకుంభ మేళాకు ఆరు ప్రత్యేక రైళ్లు..



- ఫిబ్రవరి 14, 18, 22 తేదీల్లో నడపనున్న దక్షిణమధ్య రైల్వే

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు మరో ఆరు ప్రత్యేక రైళ్లను అదనంగా నడపను న్నట్లు అధికారులు శుక్రవారం ప్రకటించారు. రైలు నంబర్ 07111 ఫిబ్రవరి 14న ఉదయం 11:10 గంటలకు బీదర్ నుంచి దానాపూర్‌కు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 23.55 గంటలకు చేరుకోనున్నది. ఈ రైలు రాష్ట్రంలో జహీరాబాద్, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట్, సికింద్రాబాదు, చర్లపల్లి, జనగాం, ఖాజీపేట్, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లలో ఆగనున్నది. ఇదే రైలు నంబర్ 07112 ఫిబ్రవరి 16న ఉదయం దానాపూర్‌నుంచి 15:15 గంటలకు బయలుదేరి, రెండో రోజు 23:45 గంటలకు చర్లపల్లి (హైదరా బాద్) స్టేషన్‌కు చేరుకోనున్నది. రైలు నంబర్ 07077 ఫిబ్రవరి 18, 22 తేదీల్లో మధ్యాహ్నం 15:00 చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి దానాపూర్ చేరుకోనున్నది. అలాగే రైలు నంబర్ 07078 ఫిబ్రవరి 20, 24 తేదీల్లో మధ్యాహ్నం 15:00 గంటలకు దానాపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 23:45 గంట లకు చర్లపల్లి చేరుకోనున్నది. ఈ రైళ్లు రాష్ట్రంలోని జనగాం, ఖాజీపేట్, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ ఆగుతాయి.

జమ్మికుంటలో రూ.7,150 పలికిన పత్తి ధర



జమ్మికుంట రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7150 పలికింది. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు 26మంది రైతులు 310క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 32క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7150, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

- **పెద్దపల్లి లో రూ.7022**

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం పత్తి ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చేయగా, శుక్రవారం మార్కెట్‌కు వచ్చిన పత్తికి అత్యధికంగా 7,022 రూపాయల ధర పలికింది. అత్యల్పంగా ఐదు వేల రూపాయలు, మోడల్ ధర 6,681 రూపాయలు పలికింది. అత్యధిక మంది రైతులకు 6,500 నుంచి ఏడు వేల రూపాయల మధ్య ధర పెట్టారు. మార్కెట్‌కు 1,199 బస్తాల్లో 1318.9 క్వింటాళ్ల పత్తిని 330 మంది తీసుకువచ్చారు. ఈ-నామ్ ద్వారానే పత్తిని ట్రేడర్లు పరిశీలించి ధరలు ఖరారు చేశారు. గురువారం అత్యధిక మంది రైతులకు క్వింటాలుకు 6,500 రూపాయలకు మించకుండా చెల్లించారు. 52 బస్తాలకే 7,001 నుంచి 7,031 ధర చెల్లించారు. అత్యధికంగా 6,500 నుంచి 7,000 చెల్లించారు.



కిందపడి గాయపడిన యాదాద్రి క్రీడాకారిణి సంగీత

కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న రాచకొండ, హైదరాబాద్ సిటీ పోలీస్ జట్లు

ఉత్సాహంగా.. పోలీస్ క్రీడలు





- పోటాపోటీగా నాల్గవ రోజు ఆటలు
- నేడు ముగింపు సమావేశం
- హాజరు కానున్న డీజీపీ డాక్టర్ జితేందర్

కరీంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మూడవ తెలం గాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు ముగింపు దశకు చేరా యి. నాలుగు రోజులుగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంతో పాటు 12 ప్రదేశాల్లో నిర్వహిం చిన 28 క్రీడలు చివరి దశకు చేరాయి. 20 పోలీస్ జోన్ల నుంచి 2400 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. పోటీల నాల్గవ రోజు శుక్రవారం వివిధ క్రీడాంశాల్లో సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యా చ్‌లను నిర్వహించారు. క్రీడా కారులు పోటాపోటీగా తమ క్రీడా ప్రతిభను చాటి విజేత లుగా నిలిచేందుకు కృషి చేశారు. వివిధ పోటీలను ఐజీపీ స్పోర్ట్స్ ఎస్ రమేష్ రెడ్డితోపాటు మరో ఐజీపీ ఎం చంద్రశేఖర్ ఎడ్డి, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, పోలీస్ స్పోర్ట్స్ ఆఫీసర్ రామారావు, ఏసీపీ విజయ్ కుమార్, ఆర్ఐ కుమారస్వామి తదితరులు పాల్గొని ప్రారంభించారు.

- **పోటీల ఫలితాలు..**

ఖో-ఖో పోటీల్లో టీజీఎస్‌బీ-1 ప్రథమ స్థానం, టీజీఎస్‌బీ-2 ద్వితీయ స్థానం, రాజన్న జోన్-3 తృతీయ స్థానం సాధించాయి. కబడ్డీ మహిళల విభాగంలో రాచకొండ కమిషనరేట్ ప్రథమ స్థానం, యాదాద్రి జోన్ ద్వితీయ స్థానం సాధించాయి. పురుషుల విభాగంలో హైదరాబాద్ సిటీ జోన్ ప్రథమ స్థానం, రాచకొండ ద్వితీయ స్థానం సాధించాయి. బాస్కెట్‌బాల్ క్రీడాంశంలో హైదరాబాద్ కమిషనరేట్ ప్రథమ స్థానం, కాళేశ్వరం జోన్ ద్వితీయ స్థానాలు సాధించాయి. హాకీ క్రీడల్లో హైదరాబాద్ సిటీ జోన్ ప్రథమ స్థానం, వరంగల్ జోన్ ద్వితీయ స్థానం సాధించాయి. హ్యాండ్‌బాల్ క్రీడలో టీజీఎస్‌బీ-1 ప్రథమ స్థానం, హైదరాబాద్ సిటీ ద్వితీయ స్థానం, భద్రాద్రి జోన్ తృతీయ స్థానం సాధించాయి. అలాగే ఫుట్‌బాల్ క్రీడలో టీజీఎస్‌బీ-1 ప్రథమ స్థానం, హైదరాబాద్ సిటీ ద్వితీయ స్థానం, సైబరాబాద్ జోన్ తృతీయ స్థానం సాధించాయి. ఈ జట్లకు కరీంనగర్ పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం రాత్రి పతకాలను ప్రదానం చేశారు.

- **నేడు పోటీల ముగింపు**

రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల ముగింపు ఉత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే ఈ ముగింపు సమావేశానికి తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన జట్లకు ట్రోఫీలతోపాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను కూడా అందించనున్నారు.

ప్రతి సంవత్సరం పోలీస్ క్రీడల నిర్వహణకు కృషి

- **ఐజీ స్పోర్ట్స్ రమేష్‌రెడ్డి**

కరీంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహణకు నోచుకోని తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ఇక నుంచి ప్రతి సంవత్సరం నిర్వహించేందుకు కృషి చేస్తానని ఐసీ స్పోర్ట్స్ తెలంగాణ రమేష్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మూడవ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలలో శుక్రవారం ఆయన ఖో-ఖో, హాకీ, వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ఘనంగా నిర్వహిస్తున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను ఆయన అభినందిం చారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో హాకీ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. అలాగే సీటీసీ మైదానంలో నిర్వహిస్తున్న ఖో-ఖో పోటీలను తిలకించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్పోర్ట్స్ ఐజీ రమేష్‌రెడ్డి

ఖో-ఖో క్రీడల్లో మంచి ప్రతిభచాటుతున్న సిరిసిల్ల జోన్ అంతర్జాతీయ క్రీడాకారుడు వెంకటేష్‌ను ఐజీ అభినం దించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ డీఎస్పీ రామారవు, ఏసీపీ విజయ్ కుమార్, సీఐ మధు, ఎస్ఐ నరేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పతకాలు అందుకున్న క్రీడాకారులు



వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న సైబరాబాద్, హైదరాబాద్ క్రీడాకారులు

మట్టి నుంచి మ్యాట్‌పైకి..

- కబడ్డీకి పెరిగిన ఆదరణ
- ప్రో కబడ్డీతో కార్పొరేట్ స్థాయికి
- అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు డీఎస్పీ ఏ వేణుగోపాల్, ఇన్‌స్పెక్టర్ ఎం మహేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడగా ఉన్న కబడ్డీ ఇప్పుడు కార్పొరేట్‌కు మారింది. పల్లెల్లో మట్టిరోడ్లపై ఆడిన ఆట మ్యాట్‌పైకి చేరింది. కబడ్డీ ఇప్పుడు కార్పొరేట్ క్రీడ.. ప్రో కబడ్డీ నిర్వహణతో రెండు తెలుగు రాష్ట్రాల అధికారిక క్రీడ ఇప్పుడు అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలు నిర్వహిస్తున్న సందర్భంగా అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు డీఎస్పీ ఏ వేణుగోపాల్, ఇన్స్‌పెక్టర్ ఎం మహేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో పలు అంశాలు పంచుకున్నారు.

ప్రో కబడ్డీని టీవీల్లో 20 కోట్ల 20 లక్షల మంది ప్రేక్షకులు వీక్షించారు. ఇది ప్రపంచ చరిత్రలో అత్యధికం. ఏ క్రీడలో లేని విధంగా అత్యధికశాతం ఉద్యోగాలు కబడ్డీతో వస్తున్నాయని వారు తెలిపారు. గతంలో తెలుగు రాష్ట్రాల్లో కబడ్డీ అకాడమీలు ఉండేవి. అప్పుడు గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభగల క్రీడాకారులు అకాడమీలో చేరి ఉన్నతమైన క్రీడాకారుడులుగా ఎదిగారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని జిల్లాకు ఒక కబడ్డీ క్రీడా అకాడమీ నెలకొల్పాలన్నారు. కబడ్డీ ఇప్పుడు ఇండోర్ క్రీడగా మారిందన్నారు. క్రీడా శిక్షణతో విద్యార్థులలో ఆరోగ్యం, చక్కని శారీరక అభివృద్ధి కలుగుతాయని అన్నారు. ఉత్తమ పౌరులుగా ఎదిగే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కబడ్డీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2017లో రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను నిర్వహించారన్నారు. ఇప్పుడు ఐసీ స్పోర్ట్స్ రమేష్‌రెడ్డి కృషితో కరీంనగర్‌లో మూడవ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను నిర్వహించడం అభినందనీయ మన్నారు. ప్రతి సంవత్సరం పోలీస్ క్రీడలను నిర్వహిస్తే, ప్రతిభగల క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.



ఏ వేణుగోపాల్, ఎం మహేందర్ రెడ్డి

> **పోలీసుశాఖలో ఉన్నతస్థాయిలో ఉన్న డీఎస్పీ ఏ వేణుగోపాల్ 2000 సంవత్సరంలో కొలంబోలో జరిగిన ఏషియన్ కబడ్డీ పోటీల్లో భారతజట్టు నుంచి పాల్గొని బంగారు పతకం సాధించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం మహేందర్‌రెడ్డి 2016 సంవత్సరంలో అస్సాంలో జరిగిన సౌత్ ఏషియన్ గేమ్స్‌లో భారతజట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించారు.**

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్,జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫె సర్ డి.వరలక్ష్మి శుక్రవారం విడుదల చేశారు. బీఏలో 47.74 శాతం, బీకాంతో 70.25, బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో 48.46, బీ ఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 60.94 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు ఆమె తెలిపారు. https://gdcwakarimnagar.com ఫలితాలు కళాశాల వెబ్సై ట్‌లో అందు బాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి న భక్తులు ఉదయం నుంచి రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లిం చుకున్న భక్తులు శ్రీపార్వతి పర మేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం అన బంధ ఆలయాల్లో కుంకుమ పూజలు ర్వహించారు.

- **రాజన్న ఆలయంలో విభాగాల హక్కులకు టెండర్ నిర్వహణ**

రాజన్న ఆలయంలోని పలు విభాగాల్లోని హక్కులకు ఓపెన్‌స్లాబ్‌లో టెండర్ నిర్వహిం చారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికా రులు రెండు సంవత్సరాలకు టెండ ర్‌ను నిర్వహించగా, కొబ్బరికాయల విక్రయం లైసెన్స్ హక్కులను రూ.2 కోట్ల 20 లక్షల 55 వేల 555కు శివరాత్రి చందు దక్కించుకోగా, వెజిటేరియన్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను వేములవాడకు చెందిన రమేష్ రూ.46 లక్షల 50 వేలకు, కరీంనగర్‌లోని ఆలయానికి చెందిన 26వ నంబర్ షాప్ రూ.3 లక్షల 60 వేలకు, రాజన్న ఆలయంలోని శ్రీస్వామి వారికి భక్తులు సమ ర్పించుకునే ఒడిబియ్యం టెండర్‌ను జోగాపూర్ గ్రామానికి చెందిన విక్రమ్ రూ.కోటి 95లక్షల 55వేల 999కి దక్కించుకున్నట్లు ఆలయాధి కారులు వెల్లడించారు.



ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

ఎగువ మానేరులోకి మల్లన్నసాగర్ నీటి విడుదల

గంభీరావుపేట. జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులోకి మల్లన్న సాగర్ నీటిని విడుదల చేశారు. రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు నీటి విడు దల చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఈ ప్రాంత రైతుల ప్రయోజ నార్థం 0.5 టీఎంసీల నీటి విడుదలకు సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ చార్జి విన్నవించారని హమీద్ తెలిపారు. రైతుల పంటలు ఎండిపోకుండా మల్లన్నసాగర్ నుంచి మానేరులోకి నీటిని విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటి విడుదలకు సహక రించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం వరకు మల్ల న్నసాగర్ నీరు ఎగువ మానేరులోకి చేరుతుండటంతో ఈ ప్రాంత రైతుల్లో ఆనందం నెలకొంది.

విజేత సూపర్‌మార్కెట్ ప్రారంభం

సుభాష్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రేగులపాటి పాపా రావు కాంప్లెక్స్ (పాత స్పెన్సర్స్ మాల్)లో నూతనంగా ఏర్పాటు చేసిన విజేత సూపర్ మార్కెట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నిరకాల సరుకులు ఒకేచోట దొర కడం ప్రజలకు ఎంతో సౌకర్యవం తంగా ఉంటుందన్నారు. సూపర్ మార్కెట్ నిర్వాహకులు మాట్లా డుతూ సరసమైన ధరలకు అన్ని రకాల వస్తువులు అందజేస్తున్నా మని తెలిపారు. అన్నిరకాల సరు కు లు అందుబాటులో ఉంచా మని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిలను సన్మానించారు. మాజీ ఎమ్మె ల్యే రేగులపాటి పాపారావు, మాజీ కార్పొరేటర్ బండ సుమ రమణారెడ్డి సూపర్‌మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.



కరీంనగర్‌లో విజేత సూపర్‌మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

వైకల్యాన్ని జయించి..

- కార్, బైక్ సర్వీసింగ్ సెంటర్లు ఏర్పాటు..
- స్వయంఉపాధితో దివ్యాంగుల ముందడుగు..

రుద్రంగి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలానికి చెందిన ఇద్దరు యువకులు పుట్టుకతో వచ్చిన లోపాలను లెక్క చేయకుండా.. పట్టుదలతో వృత్తిలో రాణిస్తున్నారు. మూగ, చెవిటివారైన ఆ ఇద్దరూ స్వయం ఉపాధితో ముందుకు సాగుతున్నారు. మెరుగైన పనితనంతో తమ వద్దకు వచ్చిన కస్టమర్లను ఆకట్టుకుం టున్నారు.

మండల కేంద్రానికి చెందిన మెల్ల దేవలక్ష్మి-నర్సరెడ్డి దంపతుల రెండో కూమారుడు మెల్ల ప్రవీణ్ పుట్టుకతో చెవిటి, మూగ. గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుకున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్టిలో పెట్టుకొని చదువు మానేసి. రుద్రంగిలో బైక్ మెకానిక్ షాపులో రెండు సంవత్సరాల పాటు రిపేరింగ్ నేర్చుకున్నాడు. అనంతరం తెలిసిన వారి వద్ద కొంత రుణం తీసుకొని కారు, బైక్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాడు. తన ఆర్థిక ఎదుగుదలకు వైకల్యం అడ్డుకాకూడదని భావించిన ప్రవీణ్ మెరుగైన పనితీరుతో వాహనదారులకు ఆకట్టుకుంటున్నాడు. ప్రస్తుతం ఖర్చులు పోను నెలకు రూ.15 వేల వరకు మిగులుతున్నాయని ప్రవీణ్ పేర్కొంటున్నాడు. అలాగే మండల కేంద్రానికి చెందిన చిట్టపురం గణేష్ అనే యువకుడు సైతం పుట్టుకతో మూగ, చెవిటి. వాహనాల వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో కొంతకాలం పనిచేశాడు. ఏడాది క్రితం కొంత అప్పు చేసి ఇంటి వద్దనే రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకొని కారు, బైక్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. తనలోని లోపాన్ని చూసి కృంగి పోకుండా స్వంతంగా ఉపాధి పొందుతున్న గణేష్‌ను పలువురు అభినందిస్తున్నారు.



కార్ వాటర్ సర్వీసింగ్ చేస్తున్న ప్రవీణ్



బైక్ వాటర్ సర్వీసింగ్ చేస్తున్న గణేష్

న్యూస్ బాక్స్

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

ఇల్లంతకుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టు జరిగింది. పదో తరగతి విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో ప్రథమస్థానంలో దివ్య, ద్వితీయ స్థానంలో నిత్య, తృతీయస్థానంలో అర్పితలు నిలిచారు. వీరిని జిల్లాస్థాయి పోటీలకు పంపుతున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పావని,తిరుపతి, ఫిజికల్‌సైన్స్ కోఆర్డినేటర్లు మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన ఏగోలపు మల్లేశం గౌడ్ ఈత చెట్టుపై నుంచి పడి శుక్రవారం గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన మల్లేశం గౌడ్ ఈత చెట్టు ఎక్కుతుండగా మోకుజారి కింద పడిపోయాడు. దీంతో గాయాలైన గీత కార్మికున్ని తోటి కార్మికులు సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ముస్తాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల మాల మహానాడు కన్వీనర్ భూమరాజుకు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోతుగల్ గ్రామానికి చెందిన భూమరాజు గీత కార్మికుడిగా పని చేస్తాడు. మండల కేంద్రానికి వచ్చి తిరిగి వెళుతుండగా రాజీవ్ కూడలిలో నిజామాబాద్ నుంచి వస్తున్న కార్ భూమరాజు బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కాగా మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు.

దళితులను అవమానిస్తే చర్యలు

కథలాపూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దళితులు, బలహీన వర్గాలను అవమానిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ నగేశ్ పేర్కొన్నారు.మండలంలోని తాండ్య్రాలలో శుక్రవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. హెడ్‌కానిస్టేబుల్ మధుకర్, దళిత సంఘాల సభ్యులు ఉన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘన నివాళి



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



ఎల్లారెడ్డిపేటలో నివాళులు అర్పిస్తున్న నాయకులు



గంభీరావుపేటలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశం గౌడ్, మార్కెట్ కమిటి డైరెక్టర్లు దుబాల వెంకటేశం, కాసర్ల రాజు, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్, నాయకులు చందన, రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

అలాగే సిరిసిల్ల పట్టణంలోని ఓ హోటల్‌లో గద్దర్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రాగుల రాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్‌తో పాటు సోమ నాగరాజు, జక్కుల రామచంద్రం, లక్కం శేఖర్, నారాయణగౌడ్, చంద్రం, సిరిగిరి శ్రీనివాస్, బాలు, రాజేందర్, బాలయ్య, కుమార్ పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలోని పాత బస్టాండు ప్రాంతంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రామచంద్రం, కాంగ్రెస్ నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, రాంరెడ్డి, లింగాగౌడ్, బుచ్చాగౌడ్, గణపతినాయక్, శ్రీనివాస్, రాజేందర్, నారాయణరెడ్డి, బాబు, బాల్‌రెడ్డి, అంజనేయులు, మహబూబ్, దేవరాజ్, భూమిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండలకేంద్రంలో వేడుకలను నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో గద్దర్ 77వ జయంతి సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమానికి షెడ్యూలు కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల కమలాకర్, మాలల ఐక్య వేదిక జాతీయ కార్యదర్శి బిట్ల శివా శ్రీనివాస్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శు లు ఎగదండి స్వామి, నల్ల రాజ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి పిట్ట రఘు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎడబోయిన ప్రభాకర్, నాయకులు రాకేష్ దోసల శంకర్, హరీష్, భూదయ్య, రామస్వామి, నాంపెల్లి, శ్రీనివాస్, సుదాకర్, సతీష్ తదిరులు ఉన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంలో తెలంగాణ మాల మహానాడు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. మాల మహానాడు సంఘం జిల్లా కన్వీనర్ నీరటి శ్రీనివాస్, బత్తుల. కమలాకర్, కోరు ట్ల రమేష్, గొట్టే ప్రభాకర్, నీరటి ప్రసాద్ పులి సత్యం, లింగంపల్లి అజేయ్ కుమార్, రాగుల ప్రభాకర్, రాగుల, సుబ్రహ్మణ్యం, బత్తుల అశోక్, బత్తుల వరయ్య, పాటి జ్యోతికుమార్, రాగుల దాసు, బత్తుల పద్మారావు, పాల్గొన్నారు.



చందుర్తిలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

చెరకు పంట సాగుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

బోయినపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చెరకు పంట సాగు, చెరుకు, మొలక, మోడెం తోటల్లో ఆచరించాల్సిన పద్ధతులు, విత్తనోత్పత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు శుక్రవారం కరీంనగర్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెరుకు పంటల్లో ఉత్తమ యాజమాన్య పద్ధతుల మీద రైతులతో శాస్త్రవేత్తల చర్చాగోష్ఠి నిర్వహించారు. జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు పంట మార్పిడిలో భాగంగా చెరకు పంటను సాగు చేసుకుంటే లాభమని, చెరకులో ఉన్న మేలైన రకాలు, వాటి గుణగణాలను వివరించారు. చెరుకు పంటలకు అనువైన నేలలు, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. చెరకు పంటలలో సోకే పురుగులు తెగుళ్ల గురించి వివరించారు. చెరకులో అధిక దిగుబడులు సాధిస్తున్న రైతులు లక్ష్మిపతి, స్థంబంపల్లి గోపాల్‌రెడ్డి, గ్రామస్థులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం, కోఆర్డినేటర్ డాక్టర్ కె. మదన్ మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ ఏం రాజేంద్ర ప్రసాద్, ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన స్థానం, రుద్రూరు శస్త్రవేత్తలు డాక్టర్ కృష్ణ చైతన్య, డాక్టర్ రాకేష్ డాక్టర్ సాయిచరణ్, జిల్లా వ్యవసాయ అధికాని అఫ్జల్ భేగం, సహాయ వ్యవసాయ సహ సంచాలకులు రామారావు, మండల వ్యవసాయ అధికారి ప్రణీత, చెరకు రైతులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్

సిరిసిల్ల రూరల్, జనవరి 31 (అంధ్రజ్యోతి) : సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 5,6వ తేదీలల్లో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట ఉపాధ్యక్షుడు శనిగారపు రజనీకాంత్ కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థుల సమస్యలపై నిరంతరం ఉద్యమాలు పోరాటాలు చేస్తున్న ఏకైక సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడుతుందన్నారు. జిల్లాలోని విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్తులో విద్యారంగ అభివృద్ధి కోసం నూతన కర్తవ్యాలు, తీర్మానాలు రూపొందించుకునేందుకు ఈ మహాసభలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ మహాసభలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఫిబ్రవరి 5,6 వ తేదీలల్లో పట్టణంలోని అంకారపు ఫంక్షన్ హాల్‌లో జరిగే జిల్లా మహాసభల్లో జిల్లాలోని విద్యార్థులు, మేధావులు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మందా అనిల్, ప్రధాన కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్, జాలపల్లి మనోజ్‌కుమార్, జిల్లా నాయకులు పెండేల అదిత్య, దినకర్, మదన్, ముబారక్, రాము, సురేష్, అజయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

కనగర్తిలో మురికి నీరు సరఫరా..



కనగర్తిలో తాగునీటి బావిలోని నీరు..

కోనరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనగర్తిలో మురికినీరు సరఫరా చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కనగర్తిలో 3రోజులుగా మురికినీరు సరఫరా అవుతున్నాయన్నారు. బావి నుంచి మంచినీరు సరఫరా చేసే గేటువాల్వ్ చెడిపోవడంతో నీరు రివర్స్‌గా బావిలోకి పోయి మురికి నీరుగా తయారయ్యాయన్నారు. అధికారులు స్పందించి గేటువాల్వ్‌ను బాగుచేసి మంచినీరు సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈవిషయమై కార్యదర్శి కవితారెడ్డిని వివరణ కోరగా గేటువాల్ చెడిపోయిన విషయం తన దృష్టికి రాలేదని, శుక్రవారం తెలిసిందని బాగు చేసి మంచినీరు సరఫరా చేస్తానని తెలిపారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

వరంగల్ కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని చారిత్రక భద్రకాళి అమ్మవారిని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. శిశిర నవరాత్రులను పురస్కరించుకొని శుక్రవారం ఆయన ముందుగా గోపూజ నిర్వహించి వల్లభ గణపతిని దర్శించుకొని అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సుద్దాలలో పౌర హక్కుల దినోత్సవం బహిష్కరణ..



సుద్దాలలో పౌరహక్కుల దినోత్సవాన్ని బహిష్కరించి మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

కోనరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో శుక్రవారం అధికారులు ఏర్పాటు చేసిన పౌరహక్కుల దినోత్సవం ప్రజా సంఘాలు బహిష్కరించాయి. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎర్రవెల్లి నాగరాజు మాట్లాడుతూ పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో సంబంధిత అధికారులు రాకపోవడంతో బహిష్కరిస్తున్నామని అన్నారు. ఈ దినోత్సవ సందర్భంగా పూర్తి స్థాయిలో అధికారులు పాల్గొని ప్రజలను చైతన్యవంతులను చేయాల్సింది పోయి అధికారులు గైర్హాజరవుతున్నారని అన్నారు. అందుకే పౌర హక్కుల దినోత్సవం బహిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్, ఎర్రవెల్లి విజయ్, దొబ్బల నరేష్ తదితరులు ఉన్నారు.

'నిర్మలమ్మ' కరుణించేనా..!

(3వ పేజీ తరువాయి)

పనులు కూడా చివరి దశకు చేరుకొని లబ్ధిదారుల ఎంపిక మిగిలింది. ఇదే దశలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ప్రభుత్వ ఆర్డర్లపై కొంత సందిగ్ధత ఏర్పడినా మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లాకు చెందిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లు నేత కార్మికుల్లో భరోసా నింపడంతో పాటు స్వశక్తి సంఘాల మహిళలకు చీరల ఆర్డర్లు, సర్వ శిక్షలో విద్యార్థులకు యూనిఫాం వస్త్రాల ఆర్డర్లు అందించడంతో పరిశ్రమ మళ్లీ నిలదొక్కుకునే దిశగా అడుగులు పడుతున్నాయి.

● ఒడిదొడుకుల ప్రస్థానం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిరిసిల్లలో నేత కార్మికుల ఆత్మహత్యలను నివారించి వారి కుటుంబాలను ఆదుకునే దిశగా ఏర్పాటు చేసిన సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు దాదాపు ఇరవై ఏండ్లుగా ఒడిదొడుకుల మధ్య ఎదురీదుతోంది. నిరంతరం ఉత్పత్తి ఆటంకాలు, ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎప్పుడైనా కూలీ పెంపు, సమస్యల పరిష్కారానికి కార్మికుల ఆందోళనతో పరిశ్రమలు మూతపడేవి. ప్రస్తుతం ఉత్పత్తులు లేక మూతపడుతున్నాయి. 2002-2003లో సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండలం సారంపల్లి, బద్దెనపల్లి గ్రామాల మధ్య 60 ఎకరాల్లో రూ.7.73 లక్షలతో టెక్స్‌టైల్ పార్కును నిర్మించారు. 2004లో పార్కు పూర్తయినా పరిశ్రమల స్థాపనకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ప్రభుత్వం తరఫున అధికారులు గుజరాత్, మహారాష్ట్రలోని పారిశ్రామికవేత్తలను కలిసి ఆహ్వానించారు. వివిధ హామీలు ఇవ్వడంతో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చారు. సిరిసిల్ల పార్కులో 1200 గజాల చొప్పున 171 ప్లాట్లు, 600 గజాల చొప్పున 106 ప్లాట్లు, వాణిజ్య అవసరాల కోసం 32ప్లాట్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం టెక్స్‌టైల్ పార్కులో 165 ఇండస్ట్రీ యూనిట్లు, 27 కమర్షియల్ యూనిట్లు ఉన్నాయి. ఇందులో 115 యూనిట్లలో 1475 ఆధునిక రాపియర్ మరమగ్గాలపై ఉత్పత్తులు జరుగుతున్నా టెక్స్‌టైల్ రంగంలోని సంక్షోభంతో నడవని పరిస్థితి ఏర్పడింది. పార్కులో గతంలో ప్రైవేటు వస్త్ర ఉత్పత్తులపైనే ఆధారపడ్డారు. ఇదేక్రమంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్, ఆర్వీఎం క్లాత్ ఉత్పత్తి ఆర్డర్లను పార్కులో కూడా కేటాయించింది. ప్రభుత్వ ఆర్డర్లు రావడంతో పార్కులోని పరిశ్రమల్లో ప్రైవేటు ఉత్పత్తులు దూరమయ్యాయి. ప్రైవేటు ఉత్పత్తులు అనుకూలంగా రాకపోవడంతో పార్కులో పరిశ్రమలు భారంగా మారాయి. ప్రస్తుతం మళ్లీ ప్రభుత్వ ఆర్డర్లు వస్తున్నా ఆశించినస్థాయిలో రాకపోవడంతో మరమగ్గాలపై పూర్తిస్థాయిలో ఉత్పత్తులు జరగడం లేదు. మెగా పవర్‌లూం క్లస్టర్ వస్తే వస్త్ర పరిశ్రమ విభిన్నంగా ముందుకుపోతుందని భావిస్తున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెక్కపల్లి, బొల్లారం, నమిలిగుండుపల్లి గ్రామాల్లో రోడ్డు నిర్మాణాలకు 2కోట్ల25 లక్షల నిధులు మంజూరు చేసినందుకు నమిలిగుండుపల్లిలో శుక్రవారం సీఎం రేవంతంరెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ల చిత్రపటాలకు కాంగ్రెస్ శ్రేణులు క్షీరాభిషేకం నిర్వహించారు.కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు కల్లపల్లి తిరుపతి, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, మాజీ ఎంపీటీసీలు బొద్దు రాములు, చెన్నాడి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సంఘ స్వామి, మాజీ సర్పంచ్ సోయినేని కరుణాకర్, బండ శ్రీనివాస్, అశోల శేఖర్, అడ్డిక జైపాల్‌రెడ్డి, మల్లేశం, నాయకులు ఎడవల్లి అనీల్, చిలుక ప్రభాకర్, హరినందన్ రెడ్డి, ఆదిల్, బొడపట్ల వెంకటేష్, కొత్తూరు సాగర్, సబ్జన్, లచ్చవ్వ, గువ్వల లింగయ్య, చిందం లింగయ్య, కడారి ఓదెల్, అనీల్, కైలాసం, పర్శరాం, శంకర్, రాజు, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం..



మహాత్మా గాంధీ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చందుర్తి జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు చందుర్తి మండల కేంద్రంలోని మాత్మగాంధీ విగ్రహానికి ప్రభుత్వ తీరుపై వినతి పత్రం సమర్పించడం పట్ల తీవ్రంగా ఖండిస్తూ మహాత్మ గాంధీ విగ్రహాన్ని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పాలతో శుద్ధిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల అసత్యపు మాటలను ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గృహజ్యోతి, రైతు భరోసా, రేషన్ కార్డు జారీ, లక్షల లోపు రుణ మాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గృహలక్ష్మీ పథకాలు అమలు జరుగుతున్నాయని, ఈ విషయం గమనించలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధర్మపురి శ్రీనివాస్, పులి సత్తయ్య, గొట్టే ప్రభాకర్, పులిసె గిరి ప్రసాద్, దూది శ్రీనివాస్ రెడ్డి, ఇందూరి మధు, దేవయ్య, అజయ్, శ్రీనివాస్, దేవస్వామి, ప్రసాద్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

పోతుగల్ సహకార సంఘ పనితీరు భేష్

- మహారాష్ట్ర వికాస్ సొసైటీ చైర్మన్ మోతే..



సహకార సంఘాన్ని సందర్శించిన మహారాష్ట్ర బృందం సభ్యులు

ముస్తాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతుగల్ సహకార సంఘం పనితీరు బాగుందని మహారాష్ట్ర సతారా జిల్లా వికాస్ సొసైటీ చైర్మన్‌వీకె మోతేతో పాటు పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. పోతుగల్ సహకార సంఘాన్ని గురువారం మహారాష్ట్రలోని సతారా జిల్లాలోగల వికాస్ సొసైటీ చైర్మన్ వికే మోతే, పాలకవర్గ సభ్యులు సందర్శించారు. సహకార సంఘం అందిస్తున్న సేవలను గురించి సీఈవో కృష్ణను అడిగితెలుసుకున్నారు. డ్రోన్ సేవలు రైతులకు అందిస్తున్న పలు రకాల రుణాలు, లాకర్స్ గురించి అడిగారు. అలాగే సంఘ పరిధిలో రెండు పెట్రోల్ బంకులు, గోదాంలులను చూపించారు. పోతుగల్ సహకర సంఘం పనితీరు, అభివృద్ధి, రైతులకు అందిస్తున్న సేవల గురించి ఎప్పుడో తెలుసుకున్నామని సందర్శించాలని అనుకున్నామన్నారు. సంఘం పనితీరు చాలా ఆదర్శంగా ఉందని చైర్మన్ తన్నీరు బాపురావు నేతృత్వంలో డైరెక్టర్‌ల సహకారంతో సంఘం అభివృద్ధి బాటలో నడుస్తోందని సందర్శకులు పేర్కొన్నారు.

సమాజ సేవలో ముందుండాలి : కలెక్టర్



కలెక్టరేట్‌లో ఏడీ బాలచంద్రం దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్



రిటైర్ అయిన ఉద్యోగులను సన్మానించిన రాజన్న ఆలయ ఈవో

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగంలో చేరి నిబద్ధతతో పనిచేసి ప్రజలకు సేవలు అందించిన అధికారులు, పదవీ విరమణ తరువాత కూడా సమాజసేవలో ముందుండాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం జిల్లా అదనపు భూముల కొలతల సర్వేయర్‌గా పని చేసి పదవీ విరమణ పొందుతున్న గౌరిశెట్టి బాలచంద్రం దంపతులను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేయర్‌గా విధుల్లో చేరి ఏడీ స్థాయికి ఎదిగిన బాలచంద్రం సేవలు మరువలేని వన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రాధాబాయి, రాజేశ్వర్, జిల్లా పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల క్రైం : జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పనిచేసి సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ పొందిన కళాధర్, ఏఎస్ఐ కిషన్‌రావు, హెడ్‌కా నిస్టేబుల్ సాంబశివరావులను ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రయోజనాలను త్వరగా అందించేందుకు కృషి చేస్తామన్నారు.

● ఎల్లారెడ్డిపేట : విధుల్లో అంకితభావంతో పనిచేస్తేనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని సీఐ శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన కిషన్‌రావు దంపతులను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ రమాకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

● వేములవాడ కల్చరల్ : వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు సేవ చేసిన ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని ఈవో వినోద్ రెడ్డి అన్నారు. రాజన్న ఆలయంలో ప్రధాన అర్చకులుగా విధులు నిర్వహిస్తున్న అప్పాల భీమాశంకర్, సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బండారి తిరుపతిరావు, జూనియర్‌అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న కాసర్ల లక్ష్మయ్య వాచ్‌మెన్ రేగుల రవీందర్లు శుక్రవారం రిటైర్మెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. రిటైరైన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం ఏఈవో శ్రవణ్‌కుమార్, నరసింహమూర్తి, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

'మూడు నెలలుగా జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు'

చందుర్తి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మూడునెలలు జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధిహామీ ఉద్యోగులు అన్నారు. ఉపాధిహామీ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని కోరుతూ ఎంపీడీవో ప్రదీప్ కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే పెండింగ్ జీతాలు ఇస్తూ ప్రతినెల ఒకటవ తేదీన జీతం విడుదల చేయాలని ప్రభుత్వాని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాజయ్య, ఉద్యోగులు అశ్విని, రంజీత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానాలలో 'రైతు భరోసా' సంబరాలు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రుద్రంగి జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండలం మానాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రైతు భరోసా విడుదలపై మానాలలో సంబరాలు జరుపుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్ జలపతి, ఉపాధ్యక్షుడు మనోహర్, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎర్రం గంగ నరసయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, జక్కు మోహన్, జక్కు వంశీ, తుమ్ రవి తదితరులు పాల్గొన్నారు.